

<u>*కథ 2008*</u>

*8*

# రామల్లి

గూళూరు బాలక్రిష్ణమూర్తి

ఉదయం 6 గంటలప్పుడు లాస్‌ఏంజెల్స్ ఎయిర్‌పోర్టు ప్రయాణీకులతో సందడి సందడిగా ఉంది. పాస్‌పోర్టు, లగేజ్ క్లియరెన్స్ తీసుకుని రామల్లి ఫ్రాంక్‌ఫర్ట్ వెళ్లే అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం ఎక్కాడు.

ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లో తన సీటును వెదుక్కుని కూర్చున్నాడు. ఫ్రాంక్‌ఫర్ట్‌లో రమేష్‌తో రెండ్రోజులు గడిపి ఇండియా వెళ్లిపోతే బాగుంటుందని అనుకుంటూ రిలాక్స్‌డ్‌గా సర్దుకుని కూర్చున్నాడు.

కాసేపటి తరువాత పండు ముసలి వయసున్న ఒక అమెరికన్ లేడీ వచ్చి పక్క సీట్లో కూర్చునింది.

ఒక్కక్షణం భలే ఆశ్చర్యమేసింది.

వందేళ్ల వయసున్నట్లుంది.

గాంధీతాత కళ్లజోడు. ముఖం మీద అరలు అరలుగా ఎవరో శిల్పి చెక్కినట్లు ముడతలు పడిన చర్మం. నెత్తి మీద పెద్దగా వెంట్రుకల్లేవు. ఉన్న కొన్ని మాత్రం కళ్లజోడు ఫ్రేమ్ మీద మెల్లగా ఒదిగి కూర్చు న్నాయి. కాలర్ లేని ఫ్రీ టీ షర్ట్, హాఫ్ ప్యాంట్ వేసుకుని ఉంది. చేతిలో చిన్న హ్యాండ్‌బాగ్.

రామల్లి ఆమెను చూస్తుండగానే నవ్వుతూ చిన్నగా పలకరించింది. షేక్‌హ్యాండిచ్చి మై నేమ్ ఈజ్... రామల్లి అన్నాడు.

ఆమె చిన్న గొంతుకతో ఎండ్లీ మేరీ అని పరి చయం చేసుకునింది. తన చేతికి ఉన్న హ్యాండ్‌బాగ్‌ను ఒడిలో పెట్టుకుని చిన్నగా కాలు మీద కాలు వేసుకుని వెనక్కి వాలింది.

ఇంతలోనే పైలెట్ గొంతు వినిపించింది. ఫ్లైట్ టేకాఫ్ అనౌన్స్‌మెంట్ వినిపించింది. సేఫ్టీ బెల్ట్ కట్టుకుని ఒక్కసారి రమేష్‌ను ఊహించుకున్నాడు. విమానం గాలి లోకి లేచింది.

పక్కన ఎండ్లీ మేరీ పలకరించినట్టనిపిస్తే తిప్పి చూశాడు.

కళ్లింత పెద్దవి చేసుకుని, ఏదో పసిగట్టినట్లుగా, "ఎక్స్‌క్యూజ్‌మి... మీరు ఏ పర్‌ఫ్యూమ్ వాడతారు?" అని ప్రశ్నించింది.

ఆ ప్రశ్నతో ఏదో అర్థమైనట్లుగా రామల్లి ఆమెవైపు తలతిప్పి, "మా ఇంటి పర్‌ఫ్యూమ్, ఎప్పుడూ నా వంటి మీద ఉంటుంద,"న్నాడు. ఎండ్లీ మేరీకి అర్థం కాలేదు. ప్రశ్నార్థకంగా ముఖం పెట్టింది. నా నుంచి వస్తున్నది గమ్మత్తయిన మల్లెల వాసన అని బదులిచ్చాడు.

ఆ సమాధానంతో ఆమె తృప్తిపడలేదని గ్రహించి కాసేపు కళ్లు మూసుకున్నాడు.

గతంలో ఇలాంటి ప్రశ్న చాలామంది నుంచి ఎదురైనా ఏదోలే అన్నట్లుగా మౌనం వహించాడు కానీ ఈ పరదేశికి చెప్పాలనిపించింది. ఇవ్వాళెందుకో మూడ్ చాలా బాగుంది. ఎగ్జయిటింగ్‌గా ఉంది.

చెప్పడం మొదలుపెట్టాడు రామల్లి.

మా ఊరి పేరు కన్యకాపురం. ఊరికి మూడు దిక్కులా ఎత్తయిన కొండలు వుంటాయి. ఒక దిక్కున మాత్రం బయటి ప్రపంచానికి దారి. ఒకేచోట కుప్ప వేసి నట్లు వందిళ్లు వరకు ఉంటాయి. ఒకటే వీధి. ఉదయం పూట ప్రతి ఇంటి ముందు పశువుల పేడతో అలికిన నేల మీద కొలువుదీరినట్లుగా ముగ్గులుంటాయి. నాగరిక ప్రపంచానికి దూరంగా విసిరేసినట్లుగా వుంటుంది. గంటన్నర నడక, లేదంటే గంటసేపు ఎద్దుల బండి మీద ప్రయాణం చేస్తే టౌన్ కెళ్లొచ్చు. ఊరి చుట్టూ కనిపించే శెనిగ చేలే జీవనాధారం. ఊరికి ఎడమ దిక్కున భీముని కొండ. అలాంటి కొండ చుట్టు

పక్కల ఎక్కడా లేదంటారు. చాలా పెద్దది. దాని పాదాల దగ్గర ఈశ్వరుని గుడి. దాని ముందర ఒక కోనేరు. కోనేటి నుంచి ఊరికి పక్కగా రాసుకుంటూ ప్రయాణించే ఏటి కాలువ.

ఏటి కాలువ పక్కనే మా చేన్లు.

ఆ కాలువ వొడ్డు మీద నేను పుట్టకముందు ఒక మల్లి చెట్టు ఉండేది. ఏటవాలుగా ఒక చిన్న కొండ రాయిని ఆనుకుని తీవీగా ఎగబాకిన తీగలు. చిత్రమేమిటంటే ఆ చెట్టు దగ్గరకు వెళ్తే ఎప్పుడూ ఏదో తెలియని రాగం వినిపించేది. ఆ రాగంలో తెలియని ఓదార్పు. కాసేపు నిలబడితే మనసు నిండిన భావన. అందుకే దాన్ని రాగాల మల్లిచెట్టు అని పిలిచేవాళ్లు. రానురాను అది రామల్లిగా స్థిరపడిపోయింది.

మరో చిత్రమేమిటంటే కాలం, ఋతువులతో సంబంధం లేకుండా ఎప్పుడూ పూలు పూసేది. కానీ అంత పెద్ద మల్లిచెట్టుమీద రోజుకు ఒక పూవే పూసేది. ఏరోజున ఏ తీగకు పూవు పూస్తుందో తెలియదు. కానీ ఒక్క పూవు పూసినా ఫర్లాంగు దూరంలో ఉండే గాలిని గట్టిగా కౌగలించుకున్నట్లుగా ఘుమఘుమలాడే మల్లె వాసనలతో నింపేసేది. ఆ ఊరికి, ఆ నేలకు, ఆ కొండలకు మల్లెల సువాసనే అందం. చీకటి పడినాకనే మొగ్గ తొడిగి వేకువజామునే పూవుగా మారుతుంది. మరుసటి రోజు పూవు పూసేలోగా కొమ్మల్లో వున్న మల్లి రాలిపోయేది.

వారం క్రితం రాలిన పూవైనా ముక్కు దగ్గర పెట్టుకుంటే మత్తుగా తలదిమ్ముగా అనిపించేది.

ఒకరోజున ఊర్లో నుంచి సుధాముడు అడవిలోకి కట్టెల కోసం వెళ్లాడు. తిరిగి వస్తుండగా కాలుజారి బండ రాయి మీద నుంచి పడి బాగా గాయపడ్డాడు. ఎలాగో చిన్నగా పడతా లేస్తా ఊరికి వస్తూ కాసేపు మల్లెతీగ చుట్టుకున్న బండరాయి కింద ఆగాడు. గాయాలనొప్పి నుంచి బాధగా మూలుగుతూ కూర్చున్నాడు. చిలిపి రాగమేదో చెవులకు చేరి బండకు అలా ఆనుకున్నాడు. ఘుమఘుమలాడే మల్లెల వాసన గాఢంగా ముక్కుల్ని తాకుతోంది. కిందంతా రాలిపడిన పూలు. ఒక పూవును తీసుకుని గాయమైన మోకాలి వద్ద సున్నితంగా అలా తాకించాడు. క్షణంలో అద్భుతం. నొప్పి మొత్తం మాయమైంది. అలాగే చేతి దగ్గర తగిలిన గాయం చుట్టూ మరో పూవుతో అలాగే చేశాడు. అక్కడ కూడా నొప్పి మాయమైంది. వెంటనే దిగ్గున పైకి లేచాడు. వెంట తెచ్చిన కత్తినెత్తుకుని నడుచుకుంటూ ఊర్లోకి వెళ్లిపోయాడు. కనిపించిన వాళ్లందరికీ తనకు కలిగిన గొప్ప అనుభూతి గురించి చెప్పడం మొదలుపెట్టాడు. కాసేపటికి ఊరంతా తెలిసిపోయింది. కర్ణాకర్ణిగా విన్న వాళ్లు సైతం సుధాముడ్ని వెతుక్కుని నిజనిర్ధారణ చేసుకుని ఒకరికి తెలియకుండా ఒకరు రామల్లి చెట్టు వద్దకు చేరారు. కడుపునొప్పితో ఒకరు, కాలునొప్పితో మరొకరు, శిరోభారంతో ఒకరు ఇలా ఊర్లోని వాళ్లంతా నొప్పి లేకపోయినా రాబోయే నొప్పి కోసం దాచుకుందామని చెట్టు దగ్గరకు చేరారు. రామల్లి చెట్టు కింద రాలిన పూలన్నీ ఏరుకుని వెళ్లిపోయారు. నొప్పి, గాయం, బాధ కలిగిన చోటల్లా పూరేకులతో మెల్లగా మర్దన చేయడం మొదలెట్టారు. కాసేపు అందరికీ మత్తుగా అనిపించింది. అదివరకు వుండే బాధలన్నీ మాయమైనాయి. అంతే ఊరికి పండుగ వాతావరణం వచ్చింది. మరుసటి రోజున రామల్లి చెట్టును ఒక దేవతచెట్టుగా భావించి చెట్టు చుట్టూ ఉండే పొదలన్నిట్నీ నరికి శుభ్రం చేశారు. కాలువ ప్రవాహాన్ని కూడా కొంత పక్కకు నెట్టి పూజలు చేశారు. కొందరు జీవాల్ని బలిచ్చారు. మన ఊరి కోసమే రామల్లి పుట్టిందని అందరూ భావించారు. ఆ రాత్రి అందరూ పండుగ చేసుకున్నారు.

ఎవరికి నొప్పి కలిగినా ఉదయాన్నే వెళ్లి ఆరోజు పూసిన పూవు కోసుకొచ్చి రేకులతో మర్దన చేసి ఉపశమనం పొందేవాళ్లు. ఇలా కొన్ని ఏళ్లు గడిచాక ఒకరోజు ఆ ఊరి వాళ్లందరికీ ఒక కల వచ్చింది. ఆ కలలో అందమైన ఒక స్త్రీ మూర్తి ప్రత్యక్షమైంది. "నేను రామల్లిని. చెట్టుకు అందం పూవే. మీ బాధలకు మల్లెల్ని ఉపశమనంగా భావించారు. సంతోషమేగానీ మీ పల్లెను పరిసరాలను ఘుమఘుమలాడించే వాసనలతో ఆహ్లాదపరిచిన మల్లెలు ఇప్పుడు మీ బాధలకు ఔషధంగా మారాయి. పూలు పరిమళాలే అందించాలి. చెట్టు నుంచి రాలిన పూలు నేలను తాకాలి. లేదా నెత్తినైనా తాకాలి. రోట్లో రోకలిపోటు కింద వుండటం అసహజం కదా.

"నా ప్రియమైన మీకందరికీ ఒక విషయం చెప్పాలని వచ్చాను. మీకు రేపటి నుంచి కలల్ని అందించాలనుకుంటున్నాను. ఎవరైతే ఆరోజు పూసిన పూవును తలలో పెట్టుకుంటారో వారికి ఒక కల ఇస్తాను," అని అంతర్ధానమైంది.

మరుసటిరోజు ఊర్లో వాళ్లంతా కలలోకి వచ్చిన రామల్లి గురించే మాట్లాడుకున్నారు. ఆ ఊరి రచ్చబండ మీద సమావేశమయ్యారు. దీనికంతటికి కారణం సుధాముడని చెప్పి పిలిపించుకున్నారు.

"నీవల్లే రామల్లెల్ని మనమంతా ఇప్పటివరకు మన బాధలకు వాడుకున్నాం. అయినా రామల్లెకు ఇంత కూడా మనమీద కోపం లేదు. కలల్ని కూడా ప్రసాదిస్తానని చెప్పింది. ఏం చేద్దామో నువ్వే చెప్పు," అని ఒక పెద్దాయన అడిగాడు.

సుధాముడు ఒక్కక్షణం కూడా ఆలోచించకుండా, "మన బాధలు ఎలాగో మనం పడదాం. కలలు

మాత్రం వద్దనుకోకూడదు. బాధల కంటే కలలు గొప్పవి,'' అని చెప్పి వెళ్లిపోయాడు.

''ఎక్స్‌క్యూజ్‌మి,'' అని ఒక ఎయిర్‌హోస్టెస్ అందంగా చిరునవ్వుతో మేరీ ముందు వినమ్రంగా వంగి పిలుస్తోంది.

మేరీతోపాటు రామల్లి కూడా ఎయిర్‌హోస్టెస్ వైపు చూశాడు. ఏం డ్రింకు తాగుతారని అడిగింది.

తనకు బ్లాక్ కాఫీ కావాలని రామల్లి అడిగాడు. మి... టూ అని మేరీ కూడా చెప్పింది.

మళ్లీ కథ చెప్పడం మొదలెట్టాడు.

సుధాముడు ఆ మాటన్నాక ఊరంతా కల కోసం రామల్లి కావాలనుకున్నారు. కలంటే అప్పటివరకు తెలియని ఆ ఊరు జనం తొలిసారిగా, తొలికల కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్నారు. ఆరోజు సాయంత్రం ఊర్లో వాళ్లంతా వయసుతో సంబంధం లేకుండా చిన్నా పెద్దా, ఆడామగా తేడా లేకుండా అందరూ పొలోమంటూ రామల్లి చెట్టు దగ్గరకు చేరారు.

చీకటి పడింది. కూర్చున్నచోట కొందరు నేలను చదును చేసుకుని కాళ్లు జాపి కూర్చున్నారు. మరి కొందరు నెత్తి కింద గుడ్డ పెట్టుకొని పడుకున్నారు. ఏ కొమ్మ మొగ్గ తొడుగుతుందో... అది ఎప్పుడు పూవు అవుతుందోనని అందరూ ఎదురుచూస్తున్నారు. సన్నటి రాగమేదో వినిపిస్తుండగా మెల్లగా ఒక్కరొక్కరే మల్లిని మరిచి, కల నొదిలి నిద్రలోకి జారుకున్నారు. అర్ధరాత్రి అందరూ ఆదమరిచి నిద్రిస్తుండగా వారి మధ్యలో ఇద్దరు మాత్రం మల్లెచెట్టునే తదేకదీక్షతో చూస్తున్నారు. అందులో ఒకడు భల్లూకుడు, మరొకరు గుంజన. చెట్టును చూస్తూనే భల్లూకుడు నడుము దగ్గర తడుముకున్నాడు. సాయంత్రం చెట్టు వద్దకు వస్తూవస్తూ ఒక సన్నటి తడిబట్టలో కొద్దిగా తడిసిన నల్లరేగడి మట్టిని తీసుకుని నడుముకు చుట్టుకుని వచ్చాడు. భద్రంగానే తగిలింది. చెట్టుకు మూడు అడుగుల దూరంలో బోర్లా పడుకుని మోచేతుల మీద శరీరాన్ని మోపి రామల్లి చెట్టు మొదలునే చూస్తున్నాడు. సరిగ్గా అతనికి ఎదురు దిక్కున తనలాగే పడుకుని చెట్టు కొమ్మలవైపు గుంజన ఆశగా ఎదురుచూస్తోంది. అలా వారిద్దరూ చూస్తుండగానే రామల్లి చెట్టులో ఒక ముత్యం మెరిసింది. రెమ్మ కొసన మొగ్గ తొడిగింది. దిగ్గున లేచింది గుంజన. పోటీలో ఎవరైనా ఉన్నారా అని తలతిప్పి చూసింది. ఎదురుగా భల్లూకుడు కనిపించాడు. కానీ అతను చెట్టు కాండాన్నే చూస్తున్నాడు. పూవు కోసం పోటీకి దిగుతాడేమోనని భావించింది. రెండు క్షణాలు అతడ్నే చూసింది. ఆమె చూపుల్లో పట్టుదల ఉంది. పూసే పూవు నాదే అన్నట్లుగా ఉంది. భల్లూకుడి చూపులో చాలా ప్రశాంతత ఉంది. గుంజనకు అర్థంకాలేదు. అంతలోనే ముత్యంలా మెరుస్తున్న మొగ్గ జిగేల్‌మంటూ వెలుగు రేఖలు విచ్చుకున్నట్లుగా పూవైంది. గుంజన ఒక్క దూకుతో ముందుకెళ్లి పూవును కోసింది. తలలో తురిమింది. అదే క్షణంలో భల్లూకుడు బొడ్లో ఉన్న కత్తి తీసి మల్లిచెట్టు కాండంలో ఒక వేరును నరికి నడుముకు చుట్టిన నల్లరేగడి మట్టిలో దాచేశాడు. సుదూరం నుంచి వయ్యారంగా గాలిలో ఎగురుకుంటూ వచ్చిన మబ్బు తెర రెప్పపాటులో వారిద్దరిని కప్పేసింది. తెరల మధ్య ఒకరినొకరు చూసుకున్నారు. కాసేపటికి నిద్రలోకి జారుకున్న వారందరూ లేచారు. పూవు కోసం వెతికారు. కనిపించలేదు. చెట్టుకు కొద్దిదూరంలో ఇద్దరు మనుషులు దేదీప్యమానంగా వెలిగిపోతూ కనిపించారు. వాళ్ల శరీరాల నుంచి మల్లెవాసనలు ఘుమఘుమలాడిపోతున్నాయి. వాళ్లు భల్లూకుడు, గుంజన.

గుంజన చుట్టూ అందరూ గుమిగూడారు. ''పూవు పెట్టుకున్నావు, కల వచ్చిందా,'' అని అడిగారు.

గుంజన సిగ్గులొలకబోస్తూ కిసుక్కున నవ్వింది. ఆ నవ్వు తెరలుతెరలుగా వినిపించింది. అందరూ ఇంటిదారి పట్టారు. గుంజనను దారి పొడుగునా కల గురించే అడుగుతున్నారు. సిగ్గుతో ఆమె చెక్కిళ్లు ఎర్రబడ్డాయి. పెదవి విప్పకుండా కల గురించి చెప్పడానికి ఆమె చేస్తున్న ప్రయత్నం అర్థమయ్యీ కానట్లుగా వుంది. తెల్లవారింది. ఈ రాత్రి మల్లె ఎవరికి దక్కుతుందో... కల కనే అదృష్టం ఎవరికి వస్తుందోనని మళ్లీ రాత్రివైపు దృష్టిపెట్టారు. పువ్వు కోసం రెండు గ్రూపులు ఏర్పడ్డాయి. గొడవలు మొదలయ్యాయి. సరిగ్గా తొమ్మిది నెలల తరువాత ఒక అర్ధరాత్రి రెండు గ్రూపులు పువ్వు కోసం గొడవకు దిగి వెంట తెచ్చిన కత్తులతో రామల్లి చెట్టునే నరికేశారు. అదే క్షణాన ఇంట్లో వున్న గుంజన పండంటి మగబిడ్డను కనింది. ఆనాడు భల్లూకుడు నరికి, రహస్యంగా అడవిలో నాటిన రామల్లి అదే క్షణాన చిగుర్లు తొడిగి పూవు పూసింది. గుంజన తన కొడుక్కి రామల్లి అని పేరు పెట్టింది. ఆ రామల్లిని నేనే. మా అమ్మ నుంచి మల్లెవాసన నాతో పాటు ఎక్కడకు వెళ్లినా వస్తుంటుంది. ఇదే నా పర్‌ఫ్యూమ్... అని మేరీ వైపు చూశాడు రామల్లి. మేరీ నిద్రపోతూ కనిపించింది. కలలో ఏదో రాగం వింటున్నట్టుగా వుంది. మరికొద్ది క్షణాల్లో ఫ్రాంక్‌ఫర్ట్‌లో ల్యాండ్ అవుతున్నట్లు పైలట్ వాయిస్ వినిపించింది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 4 మే 2008*